# జిల్లాలో 83,285 కుటుంబాలకు రేషన్‌కార్డులు

**-ప్రాథమికంగా పౌరసరఫరాల శాఖ నిర్ధారణ**
**-ఈనెల 20నుంచి 24వరకు బస్తీల్లో సభలు**
**-అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది జాబితా**




**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:** సంక్రాంతి తర్వాత అర్హులకు కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామన్న ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేస్తుంది. ఈ మేరకు పాత పద్ధతిలో కాకుండా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈనేపథ్యంలో ప్రాథమికంగా 83,285 కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అందుకు ఈనెల 20నుంచి 24వరకు నాలుగు రోజులపాటు బస్తీ సభలు నిర్వహించి స్థానిక ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుదిజాబితాను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈజాబితాలో ఎంపికైన వారికి జనవరి 26నుంచి జారీ ప్రారంభం కానుంది. వాస్తవానికి గతంలో కూడా రేషన్ కార్డుల జారీ ప్రక్రియ తరచుగా జరిగింది. ఆతర్వాత రేషన్ కార్డుల జారీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృతం చేసింది. దీంతో ఎప్పటికప్పుడు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడే కార్డులు జారీ చేస్తోంది. అధిక శాతం హైదరాబాద్ హైదరాబాద్ జిల్లా పరిధిలోనే సుమారు 2లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు అంటున్నారు.

**కొత్తగా జారీ చేసే రేషన్**

కార్డులో ఎలక్ట్రానిక్ చిప్‌ను ఏర్పాటు చేయాని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఆచిప్‌లో కుటుంబ సభ్యుల సంఖ్య, చిరునామా ఇతర సమాచారం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో సుమారు 17.21 లక్షల కార్డులు ఉన్నాయి.

**రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందక ..**

కొత్తరేషన్‌కార్డుల మంజూరులో గత ప్రభుత్వం వ్యవహరించిన విధానంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కనీసం ఎన్నికల ముందైన రేషన్‌కార్డులు ఇస్తారని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. ఎన్నికలకు ముందు తెరపైకి తెచ్చిన గృహలక్ష్మీ, బిసిలకు రూ.లక్షల ఆర్థిక సాయం, డబుల్‌బెడ్ రూం, కళ్యాణలక్ష్మీ తదితర పథకాలకు రేషన్‌కార్డులనే ప్రమాణికంగా తీసుకోవడంతో కొత్తగా పెళ్లై రేషన్‌కార్డు రానివారు అనర్హులు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో రేషన్‌కార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో కూడా ఈకార్డులే కీలకమయ్యాయి. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యానికి రేషన్ కార్డులు తప్పనిసరి కాగా వాటిని వీలైనంత త్వరలో మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి



**పంజగుట్ట, జనవరి 18 ప్రభాతవార్త :** నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందు విశేష కృషి చేస్తున్నట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం వెంకటేశ్వరనగర్ కాలనీలో, షేక్‌పేట డివిజన్‌లోని పలు కాలనీలలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా సింగాడికుంట ప్రాంతంలో టీఆర్ఎస్ భవన్ నుండి బంజారాలేక్ వరకు గల నాలా పై సుమారు 30 కోటన్ల అంచనా వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. నాలా పనులతో పాటు త్రాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ పూర్తయిన తర్వాత వాటర్ పైప్‌లైన్‌కోసం తిరిగి తవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పనులు చేపట్టే సమయంలో ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. డ్రెయిన్ నిర్మాణంలో ఎవరి ఇళ్ళను ముట్టుకోరని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే దానం నాగేందర్ కాలనీ వాసులకు వివరించారు. అదే వార్డులో ప్రతాప్‌నగర్‌లో ప్రతిపాదించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మన్నె కవిత రెడ్డి మాట్లాడుతూ నిధులు మంజూరు అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే చే సోమవారం శంఖుస్థాపన చేయనచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కనీస వసతులు ప్రజలకు కల్పించాలనే ఉద్ధేశ్యంతో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులతో క్షేత్రస్థాయిలో పరనయటించి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. ఎక్కువగా చెత్తవేసే ప్రదేశాలను గుర్తించి అక్కడ చెత్త వేయకుండా బిన్‌లను ఏర్పాటు చేసి క్లీన్‌సిటీ ఉంచడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, అధికారులు శివకుమార్, కోటేశ్వరరావు, రత్నాకర్, విజయకుమార్ పాల్గొన్నారు.

# పెండింగ్ ఫైల్స్ పరిష్కరించాలి

**-అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం**



సమీక్షాసమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:** కలెక్టర్ కార్యాలయం లో వివిధ సెక్షన్ లలో పెండింగ్ లో ఉన్న ఫైల్స్‌ను మిషన్ మోడ్ లో పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సెక్షన్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్స్ అధికారులతో సెక్షన్‌ల వారీగా సమీక్షించారు. ఒక్కొక్క సెక్షన్ ను సమీక్షిస్తూ ఎన్ని ఫైల్స్ పెండింగ్ లో ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఫైల్స్‌ను సమయానికి సమర్ధవంతంగా పరిష్కారం చేయాలనిపెండింగ్ ఫైల్స్ ను ట్రాక్ చేసి చర్యలు తీసుకోవాలని, ఫైల్స్‌ను ఎక్సెల్ షీట్‌లో నమోదు చేసి ఏ ఫైల్స్ పెండింగ్ ఉన్నాయి వాటి పరిష్కారం కోసం ప్రతి వారం సంబంధిత సిబ్బందితో సూపరింటెండెంట్‌లు సమీక్షించి ఫైల్ పూర్తయ్యేవరకు పర్యవేక్షణ చేయాలన్నారు అలాగే 3 నెలలకు పైబడిన ఫైల్స్ ను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి ఈ. వెంకట చారి, సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెట్రోలో గుండె రవాణాకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు

**-ఎల్బీనగర్ నుంచి లక్డీకపూల్ వరకు గుండె తరలింపు**

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త**

నగరంలో ట్రాఫిక్ రద్దీ బాగా పెరిగింది. ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రి నుండి లక్డీకపూల్‌లోని గ్లెనీగిల్స్ గ్లోబల్ ఆసుపత్రికి గుండెను తరలించాల్సి ఉండగా.. దీంతో హైదరాబాద్ మెట్రో అధికారులను ఆశ్రయించారు. ఇంకేం.. నగరంలో మెట్రో గ్రీన్ ఛానెల్ ఏర్పాటైంది. హైదరాబాద్ మెట్రో రైల్ శుక్రవారం రాత్రి 9:30 గంటలకు ఓ ప్రాణాపాయమైన పరిస్థితిని సమర్థవంతంగా పరిష్కరించేందుకు గ్రీన్ కారిడార్ అందించింది. ఈ కారిడార్ ద్వారా ఎల్బీనగర్ లోని కామినేని ఆసుపత్రి నుండి లక్డీకపూల్‌లోని గ్లెనీగిల్స్ గ్లోబల్ ఆసుపత్రికి దాత గుండెను వేగవంతంగా, విఘ్నరహితంగా రవాణా చేశారు. ఈ ప్రయత్నం కారణంగా అత్యవసర వైద్య సేవలకు కావాల్సిన విలువైన సమయం ఆదా చేయడం సాధ్యమైంది. ఈ అత్యున్నత సేవ హైదరాబాద్ మెట్రో రైల్, వైద్య నిపుణులు, ఆసుపత్రి అధికారుల సమన్వయంతో సాధ్యమైంది. ప్రత్యేకంగా, ఈ ప్రాణాపాయమైన మిషన్ కోసం మెట్రో సిబ్బంది, వైద్య బృందం కలిసి ప్రతీచోటా పూర్తి సమర్థతతో పనిచేశారు. గుండె మార్పిడి సంబంధిత ప్రక్రియలన్నింటిని వైద్యుల పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్ లిమిటెడ్ ప్రపంచ స్థాయి మోలిక సదుపాయాలను వినియోగిస్తూ అత్యవసర సేవలకు మద్దతుగా నిలుస్తోంది. సమాజానికి సేవ చేయడం, అత్యవసర పరిస్థితుల్లో సత్వర సహాయాన్ని అం దించడం సంస్థకు ప్రాధాన్యత. ఈ సంఘటన మెట్రో రైల్ సిబ్బంది సామర్థ్యాన్ని, సమర్థతను చాటిచెప్పింది. అలాగే, సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా సులువుగా అధిగమించవచ్చనే దానికి ఒక ఉత్తమ నిదర్శనంగా నిలిచింది. ఈ తరహా అత్యవసర సేవలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని మరోసారి స్పష్టం చేసింది. తమ మౌలిక సదుపాయాలను సామాజిక సేవల కోసం వినియోగించడం తమ నిబద్ధత అని తెలియజేసింది.

## ఎన్టీఆర్ ఆశయాలు కొనసాగిస్తాం : నందమూరి బాలకృష్ణ

**బేగంపేట జనవరి 18,ప్రభాతవార్త :** ఎన్టీఆర్ చూపిన మార్గంలో ప్రయాణిస్తూ ఆయన ఆశయాలు కొనసాగిస్తామని, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా బేగంపేట రసూల్‌పురా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నందమూరి బాలకృష్ణ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు తండ్రి అని తెలుగు ప్రజలకు మాత్రం అన్న అని అన్నారు. తెలంగాణాలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ హబ్సిగూడలో విషాదం

**తార్నాక, జనవరి 18 ప్రభాతవార :** హైదరాబాద్ హబ్సిగూడలో విషాదం చోటు చేసుకుంది. నాచారం పోలీస్ స్టేషన్ పరిధి హబ్సిగూడ సైంటిస్ట్ కాలనీలో కరెంట్ షాక్ తో ఇద్దరు కూలీలు మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. శుక్రవారం రాత్రి ఓ చిట్‌ఫండ్ కంపెనీకి సంబంధించి హోర్డింగ్ దించేందుకు బాలు ఆనే వ్యక్తికి కూలికి వచ్చాడు దీంతో అతను సహాయం కోసం రామంతాపూర్‌లో ఉన్న మల్లేశ్‌ను పిలిచాడు. భవనం 2వ అంతస్తులోని హోర్డింగ్ను దింపేందుకు వారు ప్రయత్నించారు. ఈ క్రమంలో హోర్డింగ్ జారి అక్కడే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై పడింది. దీంతో ఇద్దరికి షాక్ కొట్టి ఘటనాస్థలంలోనే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. స్థానికుల వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. కానీ, అప్పటి తీవ్ర నష్టం జరిగిపోయింది. ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతిచెందిన ఇద్దరు వాచ్‌మెన్లుగా పనిచేసే బాలు (37), మల్లేశ్ (29)లుగా గుర్తించారు. బాలుకు కుమారుడు, కూతరు ఉన్నారు. అదేవిదంగా మల్లేష్‌కు కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి స్వస్థలం తుంగతుర్తి మండలం, జైన్ గూడ, సూర్యాపేట జిల్లాగా తెలిసింది. మృతులను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. కాగా ఈ ఘటనలో రవి అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని బాదితులు విజ్ఞప్తి చేశారు.

## రెండు పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు




చోరికి గురైన దుకాణం

**కంటోన్మెంట్, జనవరి18 ప్రభాతవార్త:** కూతవేటు దూరంలో ఉన్న రెండు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగలు హల్‌చల్ చేశారు. అతి తక్కువ సమయంలోనే 14 షటర్ల తాళాలు పగులుగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. కేవలం ముగ్గురు దొంగలు చేసిన దొంగతనాలు నగరంలో సంచలనం సృష్టించాయి. తిరుమలగిరి కార్ఖానా ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో కార్ఖానాలోని ఓ బంగారు దుకాణంలో సెటర్ తాళాలు పగలగొట్టి వెండి, బంగాణాలు చోరీ చేశారు. అనంతరం అదే మార్గంలో తిరుమలగిరి ప్రధాన రహదారిలో ఏకంగా 13 బట్టల దుకాణాల షట్టర్లను పగలగొట్టి నగదును అపహరించారు. వివరాలలోకి వెళితే కార్ఖానాలోని విక్రం పూరి కాలనీలో గివ స్టోర్ నగల దుకాణం శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటలకు ముగ్గురు దొంగలు మాస్కులు ధరించి దుకాణం షెట్టర్‌ల తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. దుకాణంలో ఉన్న 30 తులాల వెండి నగలు, 9 గ్రాముల బంగారు నగలను దోచుకెళ్లారు. అదే మార్గంలో తిరుమలగిరి ఆర్టిఏ కార్యాలయం సమీపంలో ఉన్న దాదాపు 13 వస్త్ర దుకాణాల్లో షట్టర్ల తాళాలు పగలగొట్టి వాటిలో ఉన్న దాదాపు 94 వేల రూపాయల నగదును దొంగలించారు. దుకాణాల నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్ఖానా తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారి అందులోనూ రెండు పోలీస్ స్టేషన్లో మధ్య ఉన్న ప్రాంతంలో చోరీ.. చోరీ జరిగిన ప్రదేశాలు జాతీయ రహదారి కావడం, అందులోనూ ఈ రెండు ప్రదేశాలు అటు తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు ఇటు కార్ఖానా పోలీస్ స్టేషన్కు కూతవేటు దూరంలోనే ఉండడం గమనార్హం. దొంగతనానికి పాల్పడిన దుండగులు ముగ్గురు ఏకంగా గంట వ్యవధిలోనే 14 షెటర్లను తొలగించడం, ఇంత జరుగుతున్న పెట్రోలింగ్ సిబ్బంది గానీ ఇతర పోలీసు సిబ్బంది గానీ పసిగట్ట లేకపోవడం గమనార్హం.



# హైదరాబాద్ వార్త

# జగద్గిరిగుట్ట ఆలయ భూముల కబ్జాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**-ఫిర్యాదులపై బుధవారం హైడ్రా కార్యాలయంలో విచారణ..**



క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ ఏవీ రంగనాథ్, పోలీసులు, స్థానికులు

**జగద్గిరిగుట్ట, జనవరి 18, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టపై వున్న ఆలయ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలోహైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గోవిందరాజుల స్వామి ఆలయం కొలను, గుండం కబ్జా అవుతున్నట్టు పూజారి నరహరి వీడియోను కూడా చూసి ఇక్కడకు వచ్చినట్లు తెలిసింది. అలాగే అక్కడ వున్న పరికి చెరువు కబ్జాలకు కూడా స్థానికులు కమిషనర్ కు చూపించడం జరిగింది. జగద్గిరిగుట్ట ఆలయ సముదాయాలను, ఆలయ భూములను కమిషనర్ పరిశీలించారు. 2024 జూలైలో హైడ్రా ఏర్పాటు అయింది. అంతకు ముందు నిర్మించిన నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని హైడ్రా కమిషనర్ స్పష్టం చేసారు. 2024 జూలై తర్వాత జరిగిన కబ్జాలపై మాత్రం చర్యలుంటాయని హెచ్చరించారు. కుల సంఘాల పేరిట ఆలయాల భూముల కబ్జాలు చేసి స్వంతానికి వాడుకోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. కుల సంఘాల పేరిట కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్ముకోవడాన్ని కూడా సీరియస్‌గా తీసుకున్నారు. గూగుల్ మ్యాప్స్ పరిశీలించి 2024 జూలై తర్వాత వచ్చే కబ్జాలను గుర్తిస్తామని, కబ్జాదారులకు నోటీసులు యిస్తామని, హైడ్రా పోలీసు స్టేషన్ కూడా 15 రోజుల్లో పని ప్రారంభిస్తునట్లు తెలిపారు. కబ్జాదారుల నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని, స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. వచ్చే బుధవారం జగద్గిరిగుట్ట ఆలయ భూములతో పాటు పర్కి చెరువు కబ్జాలపై స్థానికులతో హైడ్రా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ఆధారాలతో హైడ్రా కార్యాలయానికి వచ్చి పత్రాలు అందజేయాలని సూచించారు. పరికి చెరువు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి, చెరువు కబ్జా కాకుండా కాపాడాలని, అధికారులకు సహకరించాలని సూచించారు. స్థానికులు ఒక కమిటీగా ఏర్పడి దేవాలయ భూముల పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. ఈ రెండు కమిటీల వాట్సాప్ గ్రూప్‌లలో తనను యాడ్ చేసి సమాచారాన్ని షేర్ చేయాలని ఆయన సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆలయ భూముల కబ్జాతో పాటు పరిరి చెరువు కబ్జాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఏవీ రంగనాథ్‌కి ఆశీర్వచనాలు అందజేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇంత సమయాన్ని వెచ్చించి కబ్జాలకు పరిశీలించడంపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. హైడ్రా రాకతో కబ్జాల ఆగుతున్నాయని త్వరలోనే మా దేవుడు భూములకు కూడా కబ్జాల విముక్తి కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్థానికులు అభినందనలు తెలిపారు. కబ్జాల నియంత్రణకు హైడ్రాతో కలసి పని చేస్తామన్నారు. హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, దేవాయదాయ శాఖల అధికారులతో పాటు స్థానిక పోలీసులు కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయి పర్యటనలో పాల్గొన్నారు.

# ప్రాచీన కళలు అంతరించిపోకుండా అందరూ చూడాలి

**-లెదర్ పప్పెట్‌లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఝాన్సీ..**





**పంజగుట్ట, జనవరి 18 (ప్రభాతవార్త):** ప్రాచీన కళలను ఈతరం వారు తెలుసుకోవడం ఎంతో అవసరమని, ముఖ్యంగా చిన్నారులు భవిష్యత్‌లో ముందుకు పోవడానికి కళలు ఎంతగానో ఉపయోగ పడతాయని ప్రముఖ యాంకర్, నటి ఝాన్సీ అన్నారు. శనివారం బంజారాహిల్స్ లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిమ్మలకుంట వాస్తవ్యులు ,ప్రాచీన తోలుబొమ్మల ఆట కళాకారులు ప్రదర్శించిన సీతా అన్వేషణ కార్యక్రమంలో ఆమె ముఖ్య లతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతమెంతో ఘనం అన్న సామెతను ప్రతి ఒక్కరూ మరచిపోకుండా ఈ తరం వారికి ఆ విషయాలను తెలిపితే జీవితంలో వారు సంప్రదాయాలతో, నియంత్రణ జీవితంతో పరివర్తన చెంది ముందుకు వెళతారని ఆమె వివరించారు. చిన్నారులు ఆధునిక జీవితంలో పడిపోయి పుసనతకాల పురుగులు గా మారారని, తల్లిదండ్రులు ఇలాంటి ప్రదర్శనలకు తమ చిన్నారులను తీసుకువెళితే వారు ఆనందించడమే కాకుండా గతంలో జరిగిన అద్భుతాలను తెలుసుకోగలుగుతారని ఆమె వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమాన్ని క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ తోలుబొమ్మల ఆట కార్యక్రమానికి బంజారాహిల్స్ ప్రాంతంలో పెద్ద ఎత్తున చిన్నారులు పాల్గొని ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ తోలుబొమ్మలాట పప్పెట్ షోలో చిన్నారులతో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఓయో కేంద్రంగా కేటుగాళ్ల గంజాయి విక్రయాలు



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో గంజాయి వి క్రేతలు

**గచ్చిబౌలి, జనవరి 18 ప్రభాతవార్త :** గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని రాష్ట్రాలు దాటించి నగరానికి తీసుకువచ్చిన ఇద్దరు కేటుగాళ్లు దాన్ని విక్రయించేందుకు ఓయో హోటల్‌నే స్థావరంగా మార్చుకున్నారు. పక్క రాష్ట్రం నుంచి తీసుకువచ్చిన గంజాయిని కొండాపూర్‌లోని ఓ ఓయో హోటల్ గదిలో పెట్టి విక్రయిస్తున్న ఇద్దరిని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 3.62కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పరిధిలోని కొండాపూర్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కావలికి చెందిన రాజు(25), మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజన్ (18)లు స్నేహితులు. గతంలో వీరు వేరువేరుగా గంజాయి విక్రయించే క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. స్నేహితులుగా మారిన తరువాత ఇద్దరు కలిసి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా అరకులో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నగరానికి అక్రమంగా తీసుకువచ్చారు. అనంతరం గచ్చిబౌలి పరిధిలోని కొండాపూర్‌లో గల ఓ ఓయో హోటల్‌లో గది అద్దెకు తీసుకొని గంజాయిని హోటల్ గదిలో ఉంచారు. అక్కడి నుంచే పలువురు వినియోగదారులకు విక్రయించసాగారు. కాగా ఈ గంజాయి స్థావరంపై విశ్వసనీయ సమాచారం అందుకున్న తెలంగాణ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి ఓయో హోటల్ మీద దాడి చేశారు. ఈ దాడిలో గదిలో ఉంచిన 3.62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు రాజు, సంజన్‌లను అదుపులోకి తీసుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించడం కోసం ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేసి నగరంలో విక్రయిస్తున్నట్లు విచారణలో నిందితులు వెల్లడించారు. దీంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# మల్లంపేట కెవిఆర్ వ్యాలీలో నకిలీ దృవపత్రాలతో ప్లాట్ల విక్రయాలు

**-వెంచర్ వేసిన వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదు**
**-అక్రమాలు ఒక్కొకటిగా వెలుగులోకి..**
**-పలువురు నిందితుల అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు**

**దుండిగల్, జనవరి 18 ప్రభాతవార్త:** మల్లంపేటలోని కెవిఆర్ వ్యాలీ వెంచర్‌లో తప్పుడు పత్రాలతో ప్లాట్లను విక్రయిస్తున్న ముఠా అక్రమాలు ఒక్కొకటిగా వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ ఆధార్‌కార్డులు, డాక్యుమెంట్లను సృష్టించి అసలు యజమానుల స్థానంలో మరోకరిని చూపుతూ అడ్డగోలుగా ప్లాట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న ఒక వ్యక్తి తన పలుకుబడితో ఇతరుల ప్లాట్లను విక్రయించమే కాకుండా పార్కు స్థలాలను సైతం ఆక్రమించి సొమ్ము చేసుకున్నారు అనే ఆరోపణలు ఉన్నాయి. వెంచర్ వేసిన వ్యక్తి ఫిర్యాదుతో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..ఏవి. రామరాజు అనే వ్యక్తి మల్లంపేటలో కెవిఆర్‌వ్యాలీ పేరుతో వెంచర్ పేరుతో లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. అయితే ఆయన నష్టాలు రావడంతో స్వస్థలానికి వెళ్ళి అంతా చక్కదిద్దున్నాక ఇటీవల నగరానికి వచ్చారు. మల్లంపేటకు చెందిన మండల నరేష్, శివ అనే వ్యక్తులు ఆయన స్థానంలో వేరే వ్యక్తులు చూపుతూ తప్పుడు దృవపత్రాలు సృష్టించి పార్కు స్థలాలను విక్రయించినట్లు తెలిసింది. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఏవిరామరాజుగా చూపిన వ్యక్తి సాంతుల కాలిముత్తు(33) అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద వెండి ఆభరణాలు, రక్తపు మరకలు ఉన్న కర్రను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో మండల నరేష్, శివలతో కలిసి నేరం చేసినట్లు నిందితుడు అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**మరో సంఘటనలో.....**

కూకట్‌పల్లికి చెందిన డా.రవికుమార్‌కు రాకేష్ అనే వ్యక్తి ద్వారా మల్లంపేటకు చెందిన మండల నరేష్ పరిచయం అయింది. తాను బిల్డర్‌ను అని పూర్ణిమ అనే భూస్వామి కోసం పనిచేసున్నట్లు తెలిపారు. మల్లంపేటలోని కెవిఆర్ వ్యాలీలో 167గజాల ప్లాటును డా.రవికుమార్‌కు చూపించి పూర్ణిమ సోదరి విక్రయానికి పెట్టినట్లు తెలపడంతో కోనుగోలు చేసేందుకు అంగీకరించారు. దీంతో సదరు స్థలాన్ని 23-11-2024 కుత్బుల్లాపూర్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డా.రవికుమార్, ఆయన బార్య అరుణ పేరు మీద జాప సృజన రిజిస్ట్రేషన్ చేశారు. తరువాత లింకు డ్యాకుమెంట్లను పరిశీలించగా టైటిల్ హోల్డర్ ఏ.వి.రామరాజు తదితర పేర్లు రావడంతో అనుమానం వచ్చిన రవికుమార్ వారిని నిలదీయగా స్పందించలేదు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. గారా లావణ్య అనే మహిళ జాప సృజన నకిలీ దృవపత్రాలను సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధారించారు. నిందితురాలని అదుపులోకి తీసుకొని విచారించగా తను మండల నరేష్, మరి కొందరితో కలిసి నేరం చేసినట్లు అంగీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఐఐసిటి డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**తార్నాక, జనవరి 18 ప్రభాతవార్త :** ఉప్పల్ శాసనసభ్యులు శ్రీ బండారి లక్ష్మారెడ్డి తార్నాకలోని ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఆయన కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. ప్రధానంగా హబ్సిగూడ నుండి నాచారం వెళ్లే దారి లో ఇరువైపులా ఐఐసిటి ఇనిస్టిట్యూట్, ఐఐసిటి క్వార్టర్స్ ప్రహరీ గోడల వల్ల ప్రధాన రోడ్డు ఇక్కడికి రాగానే బాటల్ నెక్ గా మారి ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డైరెక్టర్ దృష్టికి తీసుకుని రావడం జరిగింది.ఇదే విషయమై సంబంధిత అధికారుల నుండి క్లియరెన్స్ ఇప్పించి రోడ్డు వెడల్పు చేసేలా చూడాలని డైరెక్టర్ ను కోరారు. ఈ సమస్యపై డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే గారి నుండి ఒక లెటర్ ఇవ్వమని కోరగా లెటర్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్,టీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్‌గా నేతికార్ సురేష్ లాల్


మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న నేతికార్ సురేష్ లాల్

**తార్నాక, జనవరి 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్‌గా సికింద్రాబాద్ లాలాపేట్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ టీపీసీసీ కార్యదర్శి, ఏ..బ్లాక్ అధ్యక్షులు నేతికార్ సురేష్ లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ లాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సురేష్ లాల్ గతంలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పదవుల్లో కొనసాగారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఎంపి. అనిల్‌కుమార్ యాదవ్, ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్ తధితరులకు కృతజ్ఞతలన్నారు.

## కాంగ్రెస్‌లో ప్రతి కార్యకర్తకు గుర్తింపు : రఘుపాల్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ముంగి రఘుపాల్ రెడ్డి.

**మెహిదీపట్నం, జనవరి 18, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘు పాల్ రెడ్డి తెలిపారు. గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అవకాశం ఇవ్వలేదనే ఆరోపణ అవస్తవమని, తాను కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కార్యకర్తనేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వాదనను ఖండిస్తూ శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.. తాను కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గత 30 సంవత్సరాలుగా కృషి చేయడంతోనే మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి వరించిందని పేర్కొన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని కొందరు సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి కోసం పోటీపడిన విషయం వాస్తవమేనన్నారు. వారికి కూడా సరైన సమయంలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్వాన్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం కావాలంటే సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తనకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి రావడానికి సహాయ సహకారాలు అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కూరాకుల కృష్ణ, నాయకులు వినోద్ సింగ్, అబ్దుల్ అహ్మద్, కిషన్, షకీల, వనజ లు ఉన్నారు.

## న్యాయవాదులు ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేయాలి

-కేంద్ర కార్మికమంత్రిత్వ శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** న్యాయవాదులు ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేయాలని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు అన్నారు. శనివారం బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్‌కోర్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రఘురామ్‌రెడ్డి, ఎం.మధుసూదన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ప్రాంతీయ లేబర్ కమిషనర్ సునీల్‌కుమార్ సాహు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రాఘవేంద్ర, అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.తిరుపతిరెడ్డి, వై.రంజిత్‌రెడ్డి, కోశాధికారి బి.కిరణ్‌కుమార్, కార్యవర్గసభ్యుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన 'సరిగమలు గలగలలు' జానపద, సినీ సంగీత విభావరి


కట్టా రఘువీర్‌గౌడ్‌ను సత్కరిస్తున్న దైవజ్ఞశర్మ, త్రినాథరావు తదితరులు

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** అరవింద్ ఆర్ట్స్ అసోసియేషన్, శివశక్తి ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్, నిత్య ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వాహకుడు కట్టా రఘువీర్‌గౌడ్ నిర్వహణలో 'సరిగమలు గలగలలు' పేరుతో జానపద, సినీ సంగీత విభావరి కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. కార్యక్రమానికి కిముఖ్యఅతిథిగా ఎన్ఐఆర్‌డి రామస్వామి, అంతర్జాతీయ గాయకుడు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొని అద్భుతంగా గానం చేసిన గాయనీ గాయకులు వైఎస్.రామకృష్ణ, ఎ.సౌమిత్రి, వీణ తదితరులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో స్వరరంజని సంస్థ అధ్యక్షుడు ఎ.సౌమిత్రి, సాయిఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజాబాబు, నిత్యఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి, కృష్ణ, వినోద్‌గౌడ్, బాల్‌రెడ్డి, గోపాల్, భానుమూర్తి, ఇ.శివకుమార్, గడ్డం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మణికొండలోని చిత్రపురి కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కాలనీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ కుమార్, తదితరులు


జెండా ఆవిష్కరిస్తున్న అరవింద్‌కుమార్‌గౌడ్


దివంగతనేత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, బండిరమేశ్ తదితరులు


సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తు_న్న టీడీపి పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్,జనగాం నర్సింగ్ తదితరులు

# ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

**మణికొండ చిత్రపురి కాలనీలో**

**నార్సింగి, జనవరి 18 ప్రభాతవార్త :** దివంగత సీఎం, విశ్వ విఖ్యాత నట సార్వాభౌమడైన ఎన్టీఆర్ ఓ మనిషి కాదని... మహాశక్తి అని చిత్రపురి కాలనీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని మణికొండ చిత్రపురి కాలనీలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్వయంగా ఎన్టీఆర్ కుమారుడు మోహన కృష్ణ, కూతురు మోహన్‌రూపా, కాలనీ కార్యదర్శి దొరై, కోశాధికారి లలిత తదితరులు నివాళులు అర్పించారు.

**కుత్బుల్లాపూర్ పరిధిలో...**

**కుత్బుల్లాపూర్, జనవరి 18 ప్రభాతవార్త :** తెలుగుజాతి ఉన్నంతవరకు స్వర్గీయ నందమూరి తారకరామారావు పేరు చిరస్థాయిగా నిలిచివుంటుందని కుత్బుల్లాపూర్ కమ్మసేవా సమితి అధ్యక్షులు బొడ్డు రవిశంకర్ రావు అన్నారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని ఎనమిది స్వర్గీయ ఎన్‌టిఆర్ విగ్రహాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను హనుమంతరెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుమ్మడి ఆంజనేయులు, మద్దూరి సాయితులసి, వీరరాబు, శివరామ ప్రసాద్, టి.వి.శ్రీనివాస్, నరేంద్ర, వేణు, లక్ష్మి నర్సింహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ నగర కార్యాలయంలో**

**ముషీరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** పేదల కోసం ఆనాడు నందమూరి తారకరామారావు స్థాపించబడిన పార్టీ తెలుగుదేశం అని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు టీడీపీ నగర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరవింద్‌కుమార్‌గౌడ్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబాతో కలసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, టీడీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, పెద్దోజు రవీంద్రాచారి, ఎస్.ప్రకాశ్, కట్ట రాములు, వెంకటేష్ చౌదరి, బి.రాజు, శ్యాంసుందర్, భవాని శ్రీనివాస్, జయరాజ్ యాదవ్, సత్యనారాయణ, భానుప్రకాష్, వినోద్, కిరణ్, సలీమ్, విఠల్, యాదగిరి, చంద్రమోహన్, శక్తిప్రేమ్, అన్వర్‌హుస్సేన్, జగదీష్‌గౌడ్, సుక్రవేది, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

**మియాపూర్ డివిజన్ పరిధిలో**

**శేరిలింగంపల్లి, జనవరి 18 ప్రభాతవార్త :** తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని శేరిలింగంపల్లి నియోజక వర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు, నవరసనట నాసార్వభౌముడు దివంగత నేత నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ మెట్రో డిపో రోడ్డులోని త్రివేణి సర్కిల్,హుడా మయూరి నగర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద జరిగాయి. శేరిలింగంపల్లి నియోజక వర్గ ఇంచార్జి వి.జగదీశ ్వర్‌గౌడ్,కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి బండి రమేశ్, టిడిపి పొలిట్‌బూయర్ సభ్యులు, ఎన్‌టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టిడి జనార్ధన్, నర్సింహారెడ్డిలు, స్వర్గీయ ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కూన సత్యంగౌడ్,బాలింగ్ యాదగిరిగౌడ్, ఉరిటివెంకట్రావు,మన్నెపల్లి సాంబశివరావు,కావూరి ప్రసాద్, నాగేశ్వరావు,కనకమామిడి నరేందర్‌గౌడ్,కొడాలి శ్రీధర్, రాజేశ్,నల్లమల్ల రమేష్, వేమూరి సాంబశివరావు, ఉదయ్, రవికుమార్‌గౌడ్, తలూరి రమేష్, ఎస్‌ఆర్‌కే చౌదరి,కావూరి వినయ్,శశికాంత్,శివ,స్వరూప్,మధు,సురేశ్, ఆనందరావు, రాము,వాసు,ప్రభాకర్‌రావు, భరత్,శివానంద్‌రెడ్డి, సురేశ్, వెంకటేష్, లక్ష్మీనారాయణరావు పాల్గొన్నారు.

**సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలో..**

**కంటోన్మెంట్,జనవరి 18 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే రాజకీయ చైతన్యం వచ్చిందిన టీడీపి పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ టీడీపి అడహక్ కమిటీ మెంబర్లు జనగాం నర్సింగ్ రావ్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు మధుసూదన్, కె.ప్రతాప్, ఎస్.కె.బాబు, అనురాధ, డి.ఆర్.శ్రీనివాస్, బొట్టు మల్లేశ్, మేకల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టిఈఏఈఏ)-2025 డైరీ క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈమేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్, చీఫ్ అడ్వైజర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం శనివారం బట్టి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి అనంతరం డైరీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో అసిస్టెంట్ ఇంజనీర్లు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలను పరిష్కరించవలసిందిగా డిప్యూటీ సీఎంను కోరినట్లు తెలిపారు. అందులో ముఖ్యంగా ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 61నుంచి 60కి తగ్గించాలి అలాగే పదోన్నతులకు ప్రణాళిక బద్ధంగా నియమిత కాల పరిమితిలో అంటే ప్రతి ఆరు సంవత్సరకు గాను ( టైం బౌండ్) ఇవ్వాలని, టీజీ జెన్కోలో ఇటీవల పదోన్నతులు ఇచ్చిన ఏడీలకు ఏడిఈలుగా పోస్టింగ్ ఇవ్వవలసిందిగా కోరారు. అంతేకాకుండా క్రింది స్థాయి ఉద్యోగులకు ఉన్నత స్థాయికి పదోన్నతులు ఇచ్చే క్రమంలో పరీక్ష నిర్వహించి పదోన్నతులు ఇవ్వవలసిందిగా కోరారు. వీటన్నింటిని విన్న డిప్యూటీ సీఎం గారు సానుకూలంగా స్పందించి త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఇమ్రాన్ ,యాదగిరి, నరోత్తం కుమార్ ,రాజా రవిచంద్ర, మజహార్, ప్రియాంక ,అనిల్ రెడ్డి, ప్రవీణ్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న భట్టివిక్రమార్క, ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి హరీష్, చీఫ్ అడ్వైజర్ వినోద్ తదితరులు

## పార్లమెంట్‌లో చర్చ జరపకుండా ఎస్సి,ఎస్టి వర్గీకరణ క్రిమిలేయర్ రాష్ట్రంలో చేయొద్దు

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** ఎస్సీ. ఎస్టీ వర్గీకరణ. క్రిమిలేయర్ సుప్రీం కోర్ట్ జడ్జిమెంట్ ఇచ్చిన భారత పార్లమెంట్ లో చర్చ జరకుండా రాష్ట్ర లలో వర్గీకరణ చేయకూడదని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్. వి. ఎల్. రాజు డిమాండ్ చేశారు. శనివారం చిక్కడపల్లిలోని దళిత బహుజన ఫ్రంట్(డిబిఎఫ్) కేంద్ర కార్యాలయంలో తెలంగాణ ఎస్సీ. ఎస్టీ న్యాయవాదుల సమావేశం అల్ ఇండియా ఎస్సీ. ఎస్టీ అడ్వకేట్స్ ఫోరమ్ చైర్మన్. సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత జాతులను సామాజికంగా. రాజకీయంగా అణిచివేసి బానిసలుగా చేసికోవడానికే మనువాద కేంద్ర. రాష్ట్ర పాలకులు. దోపిడీ కుల పార్టీలు కుట్రలు చేశాయన్నారు. 59 ఎస్సీ కులాల.ఉప కులాల జనాభా లెక్కలు కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు దగ్గర లేవన్నారు. వర్గీకరణ అంశం అనేది యావత్ దళిత కులాల భవిష్యత్తు కు గొడ్డలి పెట్టులావీటిదని ఆందోళన వ్యక్తం చేసారు. దీనికోసం కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన షమీర్ అక్తర్ చైర్మన్ గా ఏక సభ్య కమిషన్ ఇచ్చే వర్గీకరణ అనుకూల సిఫార్స్ లను ఉన్నతి న్యాయస్థానల్లో సవాల్ చేయవలిసిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఎస్సీ. ఎస్టీ న్యాయవాదులు సమాయత్తం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో అల్ ఇండియా ఎస్సీ. ఎస్టీ అడ్వకేట్స్ ఫోరమ్ చైర్మన్. సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్. తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు సిలివేరి వసంతరావు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. అశోక్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రాజలింగం నేతకాని. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎమ్. రవీందర్ నాయక్. విశ్వన్నాధ.రమేష్. ప్రసన్నకుమార్ మరియు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు జె. ఎన్. రావు. దళిత బహుజన పార్టీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి. సుబ్బారావు. తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్. వి. ఎల్. రాజు, చిత్రంలో సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్

## గచ్చిబౌలిలో ప్రారంభమైన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ - 2025

**గచ్చిబౌలి, జనవరి 18 ప్రభాతవార్త** గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో జెకెఎ ఇండియా ఇన్విటేషనల్ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్ ఐదు రోజుల పాటు కొనసాగనుంది. శనివారం ఈ పోటీలను జెకెఎ హెడ్ క్వార్టర్స్ ఇన్ స్ట్రక్టర్, 8వ డాన్ ఇమురా షిహాన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జెకెఎ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, 7వ డాన్ ఆనంద రత్న షిహాన్ మాట్లాడుతూ జనవరి 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయని, మొదటి మూడు రోజులు జాతీయ స్థాయి పోటీలు, చివరి రెండు రోజులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 8 సంవత్సరాల నుంచి 72 సంవత్సరాల వయస్సు ఉన్న క్రీడాకారులు పాల్గొంటున్నారని అన్నారు. భారత్‌తో పాటు న్యూజిలాండ్, అమెరికా, శ్రీలంక, రష్యా, కజకిస్తాన్‌లకు చెందిన కరాటే క్రీడాకారులు పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు. భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన మార్షల్ ఆర్ట్స్‌లో జెకెఎ కరాటే ఒకటని, కరాటే సాధనతో మానసిక, శారీరక ద ృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు. ఈ పోటీల్లో దేశంలోని దాదాపు 25 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటుండడం కరాటే క్రీడకు దేశంలో పెరుగుతున్న ఆధరణకు నిదర్శనమన్నారు. జెకెఎ ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు 1200మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెకెఎ హెడ్ క్వార్టర్స్ 7వ డాన్‌లు తానియామా షిహాన్, హిరమాయా షిహాన్, ఆనంద్ రత్న షిహాన్, జెకెఎ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ 4వ డాన్ హీరోస్ సెన్సీ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ద ృశ్యం

## శాస్త్రీయ నృత్యాల్లో ప్రత్యేకం ఆంధ్రనాట్యం

**నాంపల్లి, జనవరి 18 ప్రభాతవార్త :** భారతీయ శాస్త్రీయ సంప్రదాయ నృత్యాల్లో ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నది ఆంధ్రనాట్యమని ప్రసిద్ధ నాట్యకారిణి, సప్తపది సినీఫేమ్ భమిడిపాటి సబిత, అభినవ మాతంగి హరికథ భాగవతారిణి, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత పద్మశ్రీ డి.ఉమామహేశ్వరిలు అన్నారు. స్వరనర్తన డ్యాన్స్, మ్యూజిక్, యోగ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో అకాడమీ వ్యవస్థాపకురాలు పద్మామోహన్ దెందులూరి నిర్వహణలో ప్రఖ్యాత ఆంధ్రనాట్య గురువు డా. కళాకృష్ణ మార్గదర్శకత్వంలో గత ఏడాది 26 అక్టోబరులో సంస్థ నిర్వహించిన ఆంధ్రనాట్య పోటీల్లో విజేతలకు ఆంధ్రప్రదేశ్ ప్రధాన అటవీ సంరక్షణాధికారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డా. దెందులూరి నళినీమోహన్ అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి సబితా, ఉమామహేశ్వరిలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఆంధ్రనాట్య అభివృద్ధికి స్వరనర్తన ఎంతగానో కృషిచేస్తోందని, ఆంధ్రనాట్యం నేర్పిస్తున్న గురువులకు, అలాగే అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారి కళాసేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆంధ్రనాట్య కళారూపాన్ని అభివృద్ధి చేయడానికి సేవలందిస్తున్న గురువులను, పోటీల్లో సీనియర్స్, జూనియర్స్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో విజేతలు 20మందిని, కళాకారులను వారు ఘనంగా సత్కరించి బహుమతులను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వరనర్తన బృందం సునీలా, శ్రవంతి, కల్పన, పవన్, సంధ్య, ధర్మవేద, మహతి, సాయి తదితరులు పాల్గొన్నారు.


సత్కారగ్రహీతలతో సబిత, ఉమామహేశ్వరి, కళాకృష్ణ, పద్మామోహన్, నళిని తదితర అతిథులు

## నార్సింగి మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతున్నాం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- నార్సింగిలో రూ.8.కోట్ల 25లక్షల పనులు ప్రారంభం

**నార్సింగి, జనవరి 18 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాలోనే నార్సింగి మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 4,5,6,7 వార్డుల పరిధిల్లో రూ.8.కోట్ల 25.లక్షల నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాళ్లు, ఆధునిక మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి వంటి అభివృద్ధి పనులను ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్ కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు తెలుసుకొని దూరం చేస్తుండడం వల్లనే ప్రజలు వరుసగా నాలుగోసారి నన్ను ఎమ్మెల్యే గెలిపించారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అధికారంతోనే ప్రజల సమస్యలు దూరం చేస్తూ, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మౌళిక వసతులైన తాగునీరు, డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, స్మశాన వాటికలు, పార్కులు, కమ్యూనిటీహాళ్లు, మరుగుదొడ్లు వంటి అనేక పనులు చేశామని వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులంతా సమిష్టి నిర్ణయాలు తీసుకుంటూ నార్సింగిని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల,మత, వర్గ, పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు రామేశ్వరం నర్సిహ్మా, మేకల ప్రవీణ్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్, పాపిరెడ్డి, హరిశంకర్, కౌన్సిలర్లు శివారెడ్డి, దుర్గేష్ యాదవ్, పత్తి శ్రీకాంత్, లక్ష్మీ ప్రవళిక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

## జర్నలిస్టులకు పెన్షన్ స్కీం అమలు చేయాలి

**సైఫాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** మీడియా రంగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ విధానం అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని పలు జర్నలిస్టు సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు శనివారం ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు ఎల్గొయి ప్రభాకర్ తదితరులు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాని న్న అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా రంగంలో పనిచేసిన పాత్రికేయులకు వృద్ధాప్యంలో ఎలాంటి సదుపాయాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అలాంటి జర్నలిస్టుల కోసం పెన్షన్ స్కింను అమలు చేస్తామని గతంలో కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే జర్నలిస్టులకు రైల్వేలో రాయితీ, ప్రత్యేక రక్షణ చట్టం, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని వారు జి.కిషన్‌రెడ్డిని కోరారు.

## డిసిఎం వ్యాన్ ఢీకొట్టడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

**గచ్చిబౌలి, జనవరి 18 ప్రభాతవార్త** ద్విచక్రవాహనం మీద వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మ ృతిచెందాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు పరిధిలోని రాణీనగర్‌కు చెందిన పైడి యశ్వంత్ సాయి శంకర్(24) ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి హఫీజ్ పేట్ పరిధిలోని కెఎస్ఆర్ ఎంపైర్‌లో నివాసం ఉంటున్నాడు. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని నానక్‌రాంగూడలో గల ఏడిపి సాఫ్ట్‌వేర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా శుక్రవారం రాత్రి విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనం మీద సాయి శంకర్ ఇంటికి బయలుదేరాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో గచ్చిబౌలిలోని ప్లాటినా వద్దకు చేరుకున్న సాయి శంకర్ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ పై నుంచి సాయి శంకర్ కింద పడిపోగా, డీసీఎం వ్యాన్ సాయి శంకర్ మీద నుంచి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలైన సాయి శంకర్ అక్కడికక్కడే మ ృతిచెందాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఈమేరకు బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా సాయి శంకర్‌కు తల్లి లక్ష్మి ఉంది.లక్ష్మి గర్భవతిగా ఉన్నప్పుడే భర్త సతీష్‌కుమార్ మ ృతి చెందగా, ఎన్నో కష్టాలు పడి సాయిశంకర్‌ను పెంచి పెద్దచేసింది. లక్ష్మి గతకొంత కాలంగా అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం కాగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమారుడే బాగోగులు చూసుకుంటున్నాడు. ఆనుకోని రోడ్డు ప్రమాదంలో సాయి శంకర్ సైతం మ ృతిచెందడంతో లక్ష్మి శోకసంద్రంలో మునిగిపోయింది.

## జిహెచ్‌ఎంసి వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ముషీరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసీ టిప్పర్ లారీ ఢీకొట్టటంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం బండమైసమ్మ చౌరస్తాలో డి.ముత్తయ్య (55) అనే వ్యక్తి కాలినడకన రోడ్డు దాటుతూ ఉండగా అతి వేగంగా వచ్చిన జీహెచ్‌ఎంసీ టిప్పర్ లారీ బలంగా ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు అవటంతో ముత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ హాస్పటల్‌కు తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రథమిక విచారణలో తేలటంతో డ్రైవర్ రాజును అదుపులోకి తీసుకున్నామని, ముత్తయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించామని సీఐ తెలిపారు.

## రూ.30 వేల పెన్షన్, నాలుగు గదుల ఇండ్లను కేటాయించాలి


తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సమావేశం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లోనేగా తెలంగాణ ఉద్యమకారులకు తగిన్ని నిదులు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అత్యవసర సమావేశం డిమాండ్ చేసింది. శనివారం చిక్కడపల్లిలో సంఘం రాష్ట్ర కార్యాలయంలో జేఏసీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ మార్చి నెలలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు, కళాకారుల కుటుంబాలకు చెందిన సమస్యలను బడ్జెట్ పరిష్కరించాలన్నారు. అదే విధంగా రూ.30 వేల పెన్షన్, నాలుగు గదుల ఇళ్ళు, 250 గజాల స్థలం, స్మృతివనం, ఆరోగ్యబీమా, ప్రమాద భీమా, గుర్తింపు కార్డులివ్వాలని ముందుగా గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. గత బి.ఆర్. ఎస్ 10 ఏండ్ల ప్రభుత్వం ఉద్యమకారులను వాడుకుని వదిలేసి అణచివేతకు గురిచేసిందన్నారు. డబ్బుసంచులతో అధికారం కావాలని కోరుకునే వారే తప్ప, ప్రజల కోసం ఏనాడు పట్టించుకోలదని, తండ్రి, కొడుకు, బిడ్డ, అల్లుడు రాజ్యంతో లక్షల కోట్లు ధనాన్ని సంపాదించారన్నారు. మళ్లీ బిఆర్ఎస్ ను దరిదాపుల్లోకి రానివ్వదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్‌లు బత్తుల సోమన్న, గంటిచంద్రుడు, పి.యాదగిరి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన గౌడ సంఘాల సమన్వయ కమిటీ


ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నేతలు బాలగౌని బాల్‌రాజ్ గౌడ్,అయిలి వెంకన్న గౌడ్, యెలికట్టే విజయకుమార్ గౌడ్‌లు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** లక్షలాదిమంది కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలుసుకొని కల్లుగీతను మినహాయించి సంపూర్ణ మద్యపానం నిషేధాన్ని అమలుపరిచిన మహానాయకుడు ఎన్టీఆర్ అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నేతలు పేర్కొన్నారు. బీసీలను రాజకీయాలకు అంటరాని వారిగా చూసినా ఆనాటి పాలకులు బీసీలకు అన్ని రంగాలల్లో తోడ్పాటు అందించిన నాయకుడు ఎన్టీఆర్ అని సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టే విజయకుమార్ గౌడ్‌లు పేర్కొన్నారు. శనివారం స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీసీ,ఎస్సి, ఎస్టీ, మైనార్టీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది ఎన్టీఆర్ పేర్కొన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పక్కాఇళ్లు, జనతా వస్త్రాలు, మధ్యాహ్న భోజన పథకం, రెండు రూపాయలకే కిలో బియ్యం.దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది నందమూరి తారక రామారావు అని గుర్తుచేశారు.

## భవిష్యత్‌లో ఎన్నో మెడల్స్ సాధించాలి : మేయర్



కృష్ణ కిషోర్‌ను అభినందిస్తున్న మేయర్

**నిజాంపేట్, జనవరి 18, ప్రభాతవార్త**

జాతీయ స్థాయిలో మెడల్ సాధించిన కృష్ణ కిషోర్‌ను మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి అభినందిస్తూ భవిష్యత్‌లో ఎన్నో మెడల్స్ సాధించి తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. శనివారం 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 3 వాస్తవ్యులు దస్తగిరి, కవిత వారి కుటుంబ సభ్యులు మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసిశారు. ఈ సందర్బంగా ఇటీవలే నిర్వహించిన సౌత్ జోన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2025, బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాండిచ్చేరి అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ వారి ఆద్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలు 46-49 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన వారి కుమారుడు పొన్నకంటి కృష్ణ కిషోర్‌ను మేయర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జనవరి18 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయం నిధి కింద 36 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ది దారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ పికెట్ లోని తన క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. పేదల ఆరోగ్యం పట్ల రేవంత్ రెడ్డి సర్కారు కట్టుబడి ఉందని, ప్రతి పేదవానికి కార్పోరేట్ వైద్యం అందించే దిశగా ప్రయత్నాలు జరగుతున్నాయని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. అందులో భాగంగానే ఆరోగ్య శ్రీ ని 5నుంచి 10 లక్షలకు పెంచిందని, కొత్త టిమ్స్ హస్పిటల్స్ నిర్మిస్తుందని అన్నారు. చెక్కులు అందుకున్న లబ్ది దారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు తేలు కుంట సతీష్ గుప్తా సంకి రవీందర్ బాబులు పాల్గొన్నారు

## ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను పాటించాలి



వాహనదారులకు ఫ్రీ లెఫ్ట్ పట్ల అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్ తదితరులు

**సికింద్రాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత ప్రణాలను కోల్పోతున్నారని, వారు రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆలుగడ్డబావి వద్ద ఫ్రీ లెఫ్ట్ మార్గం గురించి అవగాహన కల్పించారు. ఫ్రీ లెఫ్ట్ మార్గంలో వాహనాలు వెళ్లడానికి వీలు కల్పించాలని, వాహనాలకు అడ్డుగా ఉంటే జరిమానాలు విధిస్తారని చెప్పారు. చాలామంది రోడ్డు పక్కన ఉన్న చూచిక బోర్డులను కూడా చూడడం లేదన్నారు. సిగ్నల్స్ వద్ద ఉన్న బోర్డులను చూడాలని, వాటికనుగుణంగా రూల్స్‌ను పాటించాలని తెలిపారు. ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు వెళ్లకుండా అడ్డుగా ఉండడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుందని, ఉల్లంఘనలకు పాల్పడవద్దని కోరారు. ఇలాంటి వరిపై రూ. వెయ్యి జరిమాన ఉంటుందని హెచ్చరించారు. అలాగే ప్రతీ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### వారసత్వ శిలలను రక్షించుకుందాం : నిత్యానందరావు

**నిజాంపేట్, జనవరి 18, ప్రభాతవార్త**

గతానికి వర్తమానానికి అనుసంధానం చరిత్ర అని, చరిత్రలో వారసత్వ శిలలకు ప్రత్యేక స్థానం ఉందని, వాటిని రక్షించుకునే బాధ్యత పౌర సమాజంపై ఉందని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. ప్రకృతి, చరిత్రను పరిరక్షించుకునే భాగంగా తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంగణంలో గల విభిన్న ఆకృతులున్న రాతి శిలల సమీపంలో ప్రాకృతిక శిలలను కాపాడుకుందాం అనే కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ వి.సి. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాటాడుతూ ప్రతి విద్యార్థి తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకొనే విధంగా చరిత్ర గ్రంథాల సూచికలను తయారు చేయాలని, అవి భవిష్యత్ చరిత్రకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని హితవు పలికారు. దేశ వారసత్వ సంపదను విచ్చిన్నం చేయరాదని అది ప్రకృతిలో అంతర్భాగమని ప్రముఖ చరిత్రకారులు తెలుగు వర్సిటీ చరిత్ర, సంస్కృతి పర్యాటక శాఖ ఆచార్యులు డా. శ్రీనివాసన్ అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డైరెక్టర్ డా. మహేందర్ రెడ్డి, హిస్టరీ శాఖ శాఖాధిపతి డా. వనజా ఉదయ్ పాల్గొన్నారు.

### సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నగర నేతలు

**ముషీరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరగబోయే సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం గోల్కొండ చౌరస్తాలోని సీపీఎం నగర కార్యాలయంలో మహాసభల గోడ ప్రతులను నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.దశరథ్, నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్‌లతో కలసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన రాజకీయ పరిణామాలను, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు జరిగిన ప్రజా పోరాటాలను సమీక్షించుకుని, రాబోయే మూడు సంవత్సరాల కాలానికి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకునే ముఖ్యమైన ఘట్టం ఈ మహాసభలని అన్నారు. సంగారెడ్డిలో జరగబోయే ఈ మహాసభలు ప్రజా పోరాటాలను మరింత ఉధృతం సాగించేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగానే అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం పద్మారావునగర్‌లోని వెంకటాపురం కాలనీలో 40 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ఇబ్బందులను దూరం చేసినట్లు వివరించారు. కాలనీ వాసులు తమకు ఒక పార్క్ కావాలని కోరగ, త్వరితగతిన పార్క్‌ను అద్బుతంగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. వెంకటాపురం కాలనీలో పార్క్ పక్కనే శిధిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ స్థానంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 40 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని, ఈరోజు పనులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డీసీ సమ్మయ్య, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, అధికారులు సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, టౌన్ ప్లానింగ్ డీసీపీ సుష్మిత, నాయకులు ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటాపురం కాలనీ అధ్యక్షుడు వజీర్ మోహన్, సకినాల రాజు, చక్రధర్ యాదవ్, సుధాకర్, రమణ, పద్మిని, ఆశ, విజయలక్ష్మీ, గజలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**న్యూ బోయగూడలో ....**

న్యూబోయగూడలోని ఉప్పలమ్మ దేవాలయం పరిధిలో అధికారులతో కలిసి పర్యటించి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆలయం పక్కనే ఉన్న బస్తీలకు రోడ్ల నిర్మాణం చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అక్కడే ఉన్న డిప్యూటి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను ఆదేశించారు. అనంతరం బోయగూడ లోని టింబర్ డిపో లైన్ లో 20 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులను ప్రారంభించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సి.సి రోడ్డు పనులను చేపట్టేందుకు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సున్నంరాజ్‌మోహన్

**అఫ్జల్‌గంజ్, జనవరి 18ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను అంచెలంచెలుగా కృషి చేస్తున్నట్లు పురానాపూల్ డివిజన్ మజ్లీస్ పార్టీ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని సుఖ్‌మీర్ కమాన్ నూతనంగా చేపట్టే సిసి రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక విన్నపంమేరకు కొత్తగా సిసి రోడ్డు పనులను మంజూరు చేయించి త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలోమజ్లీస్ నాయకులు ఖాలేద్ బిన్ మిజ్జా, ఖురీషిజా ఖాలేద్‌బాసుబుర్రా పాల్గొన్నారు.

## 26న శ్రీనివాస్ గుప్త అమరణ నిరాహార దీక్ష



బోనాల శ్రీనివాస్‌గుప్త అమరణ నిరాహార దీక్ష మద్దతు ప్రకటించిన డాక్టర్ నాగేష్

**అఫ్జల్‌గంజ్, జనవరి 18 ప్రభాతవార్త:** తెలుగు విశ్వ విద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26వ తేది ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్తకు డాక్టర్ నాగేష్, ముషీరాబాద్ ప్రజా ఏక్తాపార్టీ ఇన్‌చార్జ్ సాంబ రవీంద్రనాథ్‌లు మద్దతుప్రకటించారు. శనివారం గౌలిగూడలోని ప్రజా ఏక్తా పార్టీ కేంద్ర కార్యాలయంలో వారు బోనాల శ్రీనివాస్‌ను మర్యాధ పూర్వకంగా కలిసి ఈనెల 26వ నుంచి చేపట్టనున్నట్లు అమరణ నిరాహారా దీక్షకు వారుమద్దతు తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు దేశ చరిత్రతోపాటు తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెలో అమరవీరుడిగా నిలిచిన మహోన్నత నాయకుడని అని ఆయన పేరుతొలగించడం అంటే ఆ మహనీయుని అవమానించిట్లేనని వారు అభిప్రాయ వ్యక్తం చేశారు. అసలు పొట్టి శ్రీరాములు పేరు ఎందుకు తొలగించారని వారు ప్రశ్నించారు. మేధావులు, కళాకారులు, కళాశాలలోవిద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు కూడా బోనాలశ్రీనివాస్ గుప్త చేపట్టే అమరణ నిరాహార దీక్షకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణికులను దేవుళ్లుగా భావించాలి : ఆర్.ఎం.రాజశేఖర్



ఆర్టీసీలో ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేసస్తున్న ఆర్.ఎం. రాజశేఖర్

**కంటోన్మెంట్, జనవరి 18 ప్రభాతవార్త:** ఆర్టీసి ఉద్యోగులు సంస్థ మనుగడ కోసం పాటుపడాలని, ప్రయాణికులే దేవుళ్లుగా భావించుకొని విధులు నిర్వహించాలని ఆర్టీసి సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ తెలిపారు. ఆర్టీసిలో కారుణ్య నియామకాలు, మెడికల్ అన్‌ఫిట్ అయిన 16 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు శనివారం సికింద్రాబాద్ ఆర్.ఎం. రాజశేఖర్ నియామకపత్రాలను అందజేశారు. కారుణ్య నియామకం, మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగుల పిల్లలకు, వారి కుటుంబ సభ్యులకు కండక్టర్ ఉద్యోగులుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ అఫీసర్ ఎం.భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఆర్.ఎం. ఎం.సురేశ్ చౌహాన్, అసిస్టెంట్ మేనేజర్ పర్సనల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి : దగ్గుబాటి రానా



సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో పూజలు, షూటింగ్ చేస్తున్న దగ్గుబాటి రానా ,యాంకర్ సుమ, ప్రియదర్శి తదితరులు

**కంటోన్మెంట్, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని నటుడు దగ్గుబాటి రానా తెలిపారు. శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గణపతి దేవాలయంలో నిర్వహించిన పూజలు, ఓ షూటింగ్ కార్యక్రమానికి వచ్చారు. ఈ సందర్బంగా ఆలయంలోకి భక్తులను అనుమతించకపోవడంతో పోలీసుల తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల అనుమతితోనే గణపతి దేవాలయానికి రావడం జరిగిందని దగ్గుబాటి రానా ,యాంకర్ సుమ, బలగం సినిమా కథ నాయకుడు ప్రియ దర్శిలు తెలిపారు.

## టిడిపి నాయకులు దినేష్ రక్తదానం..

**బేగంబజార్, జనవరి 18ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి సందర్భంగా గోషామహాల్ నియోజకవర్గం టిడిపి నాయకులు కె.డి.దినేష్ రక్తదానం చేశారు. బంజారాహిల్స్‌లోని టిడిపి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును చేపట్టారు. ఈకార్యక్రమంలో టిడిపి జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, టిటిడి మెంబర్ నర్సి రెడ్డి, సిటి జనరల్ సెక్రెటరీ నల్లల కిషోర్, స్టేట్ సెల్ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల దోపిడిపై చర్యలు చేపట్టాలి : ఆకుల సతీష్



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న భాజపా శ్రేణులు

**దుండిగల్, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రభుత్వ భూముల దోపిడిపై చర్యలు చేపట్టాలని కోరుతూ భాజపా నాయకులు ఆకుల సతీష్ పార్టీ శ్రేణులతో కలిసి శనివారం గండిమైసమ్మదుండిగల్ మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ మండల పరిధిలోని పలుచోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. దొమ్మరపోచంపల్లి సర్వేనంబర్ 120లో బిఆర్ఎస్ కార్యాలయంకు ప్రభుత్వ కేటాయించిందని ఒక ఎకరం స్థలం మాత్రమే అన్నారు. అయితే తమ పలుకుబడితో మరో 20గుంటలు ఆక్రమించారని సదరు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని రెవిన్యూ యంత్రాంగంకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు దోపిడికి గురవుతున్న అధికారులు చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. రెవిన్యూ యంత్రాంగం వెంటనే స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్ల జయశంకర్, అమలేశ్వరి, చందు, అరుణ్‌రావు, బలరామ్, సుహాసినిశక్తి, కవితారెడ్డి, శ్యామ్‌కుమార్‌రెడ్డి, రమేష్, సుధాకర్‌రెడ్డి, మహేశ్, కుమార్‌గౌడ్, రాజు, పాండు, ప్రశాంత్, గణేష్, ముఖేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని సైకిల్ యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దేశ్వర్

**సైఫాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 'సైకిల్ యాత్ర' నిర్వహిస్తున్నామని ఓబిసి జాయింట్ యాక్షన్ కమిటి తెలిపింది. ఈ సైకిల్ యాత్ర ఈ నెల 19వ తేదీన జనగాం జిల్లాలోని కిలాసాపూర్ నుంచి ప్రారంభమైన వివిధ జిల్లాల్లో 14 రోజుల పాటు 400 కిలోమీటర్లు కొనసాగుతుందని బిసి హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ చెప్పారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాక్ ఛైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్, బొమ్మ రఘురామ్‌నేత, ఎస్పీఎన్ చారితో కలిసి ఆయన మాట్లాడుతూ సైకిల్ యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే 42 మంది బిసి యోధులతో రాష్ట్ర వ్యాప్తంగా ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బహిర్గతం చేయాలని, బిసిల జనాభా ప్రాతిపతికన రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సైకిల్ యాత్రలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో జెఏసి నాయకులు కొంగర నరహరి, మహేష్‌గౌడ్, పార్వత సతీష్, విజయ్ కుమార్, అరుణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్‌కు కేంద్రం భారత రత్న అవార్డు ప్రకటించాలి

**సైఫాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** పేద, బడుగు బలహీన వర్గాలకు విశేషమైన సేవలు అందించిన మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి 'భారత రత్న' అవార్డును ప్రకటించాలని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ తెలుగు సినీ రంగంలో మకుటం లేని మహారాజ్‌గా గుర్తింపు పొంది, తెలుగు వారి పేరు ప్రతిష్టలను దేశ, ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేసిన రామారావు భారత రత్న అవార్డుకు అన్ని విధాల అర్హుడని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు ఆయన ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

### కమలాకరశర్మను ప్రజాక్షేత్రంలో నిలబెడతాం :గిరిప్రసాద్ శర్మ

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** వడ్డీ ఆశ చూపి వందల కోట్లు వసూలు చేసి, మోసం చేసిన ధన్వంతరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పంతంగి కమలాకరశర్మను బ్రహ్మణ ప్రజాక్షేత్రంలో నెలబెట్టి బాధితులకు న్యాయం చేస్తామని ధన్వంతరి ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ అన్నారు. కమలాకర్ శర్మ విశ్రాంత ఐపీఎస్ అధికారులను అడ్డంపెట్టుకుని రూ.1,500 కోట్లు వసూలు చేసి, వాటిల్లో రూ.543 కోట్లను దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. శనివారం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడారు. అమాయక బ్రాహ్మణ బాధితులకు 2025 జనవరి 15 లోగా న్యాయం చేయాలని గతేడాది గడువు విధించా మని తెలిపారు. గడువు ముగిసిన నేపథ్యంలో ఆయనకు తగిన రీతిలో బుద్ధిచెబుతామని ఆయన హెచ్చరించారు. బాధితులకు అధిక వడ్డీ ఇస్తా మని ఆశ చూపి ఎవరికీ ఇవ్వలేదని, 4 వేల మంది బాధితులు కమలాకర శర్మ మోసానికి బలైపోయారని ఆరోపించారు. బాధితులలో చాలా మంది ఇప్పటికే చనిపోయారని, బాధిత వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని వాపోయారు. కొంతమంది మహిళలను అడ్డం పెట్టుకుని ఈ మోసాలకు పాల్పడ్డారన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువకావాలి : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఏలూరి శ్రీనివాస్, కృష్ణయాదవ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం లో ప్రభుత్వ ఉద్యోగులు ప్రధాన పాత్ర వహించాలని హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం హైదరాబాద్ జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం -2025 సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం కలెక్టరేట్‌లో నిర్వహించగా దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే సంక్షేమ పథకాలు అమలు చేయడంలో గెజిటెడ్ ఉద్యోగులు తమ వంతు కృషి చేయాలన్నారు. గెజిటెడ్ ఉద్యోగులసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ,ప్రజలకు, ప్రభుత్వానికి ఉద్యోగులు వారధి లా పనిచేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఉద్యోగులు చిత్త శుద్ధితో కృషి చేయాలన్నారు. రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగులందరు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ఎప్పటికప్పుడు సంసిద్దులుగా ఉంటారన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం అధికారులు యింకా మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేసి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రం లోనే ప్రథమ స్థానం వచ్చేటట్లు పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, శ్యామ్, జగన్మోహన్‌రావు, పరమేశ్వర్ రెడ్డి. సుజాత హైదరాబాద్ కార్యదర్శి ఖాదర్, ఆశన్న, డాక్టర్ ఎన్ సురేందర్. కోటాజి, వెంకటరమణారెడ్డి. శ్రవణ్, కుమార్, శ్రీరాములు, డాక్టర్ రమేష్, డాక్టర్ సందీప్, పసుపులేటి శ్రీనివాస్, ప్రభాకర్, డాక్టర్ సునీత జోషి టీఎన్జీవో జిల్లా నాయకుడు విక్రమ్, వివిధ డిపార్ట్మెంట్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## బసవతారకంలో ఎన్టీఆర్ వర్ధంతి ...నివాళులర్పించిన నందమూరి బాలకృష్ణ



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న నందమూరి బాలకృష్ణ

**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:**

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌లో శనివారం స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కుమారుడు ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ స్వర్గీయ సామాన్య రైతు కుటుంభంలో పుట్టి సినిమా రంగంలో మహరాజులా ఎన్టీఆర్ పెరిగారన్నారు. తెలుగు రాష్ట్రాలు ఎదుర్కొన్న ఎన్నో సంక్షోభాలలో తన వంతు పాత్ర పోషించి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని పొందారన్నారు. తాను రాజకీయాలకు రావడమే కాకుండా ప్రజలలో రాజకీయాల పట్ల చైతన్యం తీసుకొనివచ్చిని వ్యక్తి అని, తెలుగు దేశం పార్టీని స్థాపించి అఖండ విజయంతో ప్రజలలో కూడా రాజకీయ హీరోగా గుర్తింపు సాధించారని చెప్పారు. ప్రజలకు అవసరమైన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే కాకుండా తర్వాతి ప్రభుత్వాలు కూడా వాటిని కొనసాగించే రీతిలో పని చేశారన్నారు. తన తల్లి క్యాన్సర్ తో భాదపడి మరణించినప్పుడు పేదవారందరికీ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్యాన్సర్ వైద్యం అందించాలనే సంకల్పంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటు చేశారని దీనిద్వారా ఎందరో పేదలకు పలు రకాల సహాయం, చికిత్స అందించగలుగుతున్నామని, అదే సమయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులోనికి తీసుకొని వస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. త్వరలో ఆంద్ర ప్రదేశ్ లో కూడా హాస్పిటల్ నిర్మాణం చేస్తామని బాలకృష్ణ ప్రకటించారు. అనంతరం హాస్పిటల్ లో ఉన్న ఆరోగ్య శ్రీ వార్డులను సందర్శించిన చికిత్స పొందుతున్న రోగుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేసి, వారితో సెల్ఫీలు దిగి సంతోషపెట్టారు. ఈ కార్యక్రమాలలో సిఈవో డా. కె కృష్ణయ్య, డైరెక్టర్ డా. టియస్ రావు, మెడికల్ డైరెక్టర్, దాఫణికోటేశ్వర రావు, మెడికల్ సూపర్నిటెండెంట్ డా. కల్పనా రఘునాద్, వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

### సంగీతం ద్వారా జన్మ తరిస్తుంది : శ్రీనివాస్



ప్రముఖ వీణా వాదన నిపుణురాలు ఆనంద రాజ్యలక్ష్మి ...లను సత్కరించిన

**చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** సంగీతం ద్వారా జన్మ తరిస్తుందని జిఎస్‌టి విశ్రాంత ఉన్నతాధికారి ఎం శ్రీనివాస్ అన్నారు. విఖ్యాత వాగ్గేయకారుడు శ్రీ త్యాగరాజ స్వామి 178 వ ఆరాధనోత్సవాలు త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి ఆధ్వర్యంలో ఆరంభమైనాయి. ఉదయం గానసభ ప్రాంగణంలో త్యాగయ్య విరచిత పంచరత్న కీర్తనలు గోష్ఠి గానంతో వేడుక ఆరంభమైంది. ప్రముఖ వీణా వాదన నిపుణురాలు ఆనంద రాజ్యలక్ష్మి తమ వీణవాదనం లో ఎందరో మహానుభావులు, తెరతీయగ రాదా, నిధి సుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా తదితర త్యాగరాజ కీర్తనలు వినిపించారు. సాయంత్రం కళా సంగీత నాట్య వేదిక పై గానసభ నాట్య గురువు తులసి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన వాసు శిష్య బృందం నాట్య అంశాలు ప్రదర్శనతో పాటు సంగీత గురువు సంయుక్త తన శిష్య బృందంతో శాస్త్రీయ గాన గోష్ఠి తో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎం.శ్రీనివాస్ శాలువా జ్ఞాపిక తో ఆనంద రాజ్యలక్ష్మిని సత్కరించారు. పాలక వర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సంగీతంలో రాణిస్తున్నారంటే అది భగవంతుడి కృప ఉంటేనే సాధ్యమవుతుందన్నారు.

### లాల్ దర్వాజలో ఎన్టీఆర్‌కి నివాళి



**చార్మినార్. జనవరి 18 ప్రభాతవార్త :** చార్మినార్ నియోజకవర్గం లోని లాల్ దర్వాజలో శనివారం టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. టి.డి.పి.నాయకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టి.డి.పి.నాయకులు రవీందర్ చారి. నవల కిషోర్ అగర్వాల్. మాజీ కార్పొరేటర్ శంకర్ ముదిరాజ్. చంద్ర కుమార్. సల్ల రాజ్ కుమార్. కె.శ్రీ కాంత్. బి. శ్రీ కాంత్. రాములు. శైలేష్ కుమార్. చాంద్ పాషా. అశోక్ పాల్గొన్నారు.

## 21న విద్యుత్ వినియోగదారుల వేదిక

**బేగంబజార్, జనవరి 18 ప్రభాతవార్త:**

విద్యుత్ వినియోగదారుల సమస్యలతోపాటు పరిష్కార వేదికను ఈనెల 21వ తేదిన గోషామహల్ ట్రాన్స్‌కో కార్యాలయంలో ఉదయం 10గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ పర్వాత్‌అలీ, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ పి.నాగిరెడ్డిలు తెలిపారు. విద్యుత్ సరఫరాలో తరుచుగా అంతరాయాలు, విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యలు, విద్యుత్ మీటర్ సమస్యలు, విద్యుత్ బిల్లులలో సమస్యలు, కొత్త సేవలను అందించడానికి నిరాకరించడం లేదు, జాప్యం, పేరుబదిలీ, సేవా కేటగిరి మార్పు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ట్రాన్స్ ఫార్మర్ల భర్తీ, బకాయిల చెల్లింపు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏవైనా ఇతర సమస్యలు, విద్యుత్ చట్టం, విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలకు అనుగుణంగా, తగు విచారణ తర్వాత పరిష్కరించనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం వేదికను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.







**CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, Harsh Pradeep Ailani S/o. Late Pradeep Kumar Ailani R/o. H.No. 1-2-38, Domalguda, Badamgalli, Hyd. Changed My Name As HARSH AILANI.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదాచేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT HAYATHNAGAR O.S.NO. 938 OF 2024**

**Between :**
Bodige Nagendra Goud & another ..Plaintiffs
**AND**
The Tahsildar, Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, At Abdullapurmet & another. ...Defendants
To
All Concerned ...Defendant No.2

**NOTICE**

That the above named Plaintiffs filed the above suit for declaration to declare them as legal heirs of deceased Bodige Madhusudhan @ Madhusudhan Goud, who died intestate on 20-01-2012, due to ill-health against you and another before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District at Hayathnagar and the above suit is posted on 20-1-2025 for objections. If any person/s he/she/they are having any objections he/she/ they may appear before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District at Hayathnagar on 20-1-2025 either in person through an Advocate, failing which the matter will be decided as Exparte in your absence.

**SCHEDULE OF PROPERTY**

All that piece and Parcel of Land bearing plot No.4 admeasuring 260 Sq.Yards or 217.36 Sq.Mtrs in Sy.No.4 & 5 in SRI LAKSHMI ENCLAVE of Surmaiguda Village, Lashkerguda Gram panchayath, Abdullapurmet (Previously Hayathnagar) Revenue Mandal, Ranga Reddy District, Telangana State and bounded by: NORTH: Plot No.5, SOUTH: Plot No.3, EAST:60' Wide Road, WEST: Plot No.62

**(BY ORDER OF THE COURT)**
**Sd/- (T.Eshwar)**
**Advocate**
Hayathnagar, Ranga Reddy District
Counsel for the Plaintiffs
**Phone No. 8397297266.**

**IN THE COURT OF THE HON'BLE XXVI ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD OS. No. 537 of 2024**

**Between:**
Choppala Anil & 2 ors ...Plaintiffs
**AND**
Mandal Revenue Officer Balanagar & 3 ors ...Defendants

To Defendant No.1 to 4 and All concerned, **Defendant No.1 Mandal Revenue Officer,** Balanagar MRO Office, Office address located at C22/4, IDA, Balanagar X Roads, Balanagar, Hyderabad, Telangana 500037. **Defendant No.2 Mandal Revenue Officer,** Shamshabad MRO Office, Office address located at MRO Office Road, Shamshabad, Hyderabad, Telangana 501218. **Defendant No.3 Sub Register Officer,** Balanagar SRO office, Office located at Opp Indian Drugs and Pharmaceuticals Ltd IDPL, Jinkalwada, Balanagar, Hyderabad Telangana 500037. **Defendant No.4 Sub Register Officer,** Shamshabad SRO Office Office located at-405, Rallaguda Road Above Sub-Registration office, Shamshabad, Hyderabad, Telangana 501218
All concerned
Whereas These Plaintiffs have filed this OS for declaring them as legal heirs of late Smt. Choppala Dhanalakshmi and Choppala Sundera Rao in respect of the following properties in: A) Residential House No. 13-1-208/2/R&NR Yousufguda built on Plot No.12 in S.No.132, admeasuring 300 sq.Yds., or 250.83 sq.Mts., situated at Yousufguda, Balaji Venkateshwara Co-Operative Housing Society Ltd., Yousufguda, Hyderabad. North: Plot No.11, South: Plot No.13, East: Plot No.19. West: Proposed 30' Wide Road. B) Farm Site No.206, admeasuring 500 sq.Yds., or 418.41 sq. Mts. in survey No.154, in Millinium Residency, situated at PeddaShapur Village and Gram Panchayat, Shamshabad Mandal, Rangareddy District. North: Farm Site No.256, South: Farm Site No.207, East: Farm Site No.254, West: 30' Wide Road. C) Farm Site No.326, admeasuring 500 sq. Yds., or 418.41 sq. Mts. in survey No.406, in Millinium Park situated at Shamshabad Village and Mandal, Rangareddy District. North: Farm Site No.362, South: Farm Site No.325, East: Farm Site No.363, West: 30' Wide Road. The OS is posted on **28.01.2025** for appearance. Objections if any may be filed by **10.30 AM on 28.01.2025.**

**//By Order of the Honourable Court//**
**N.V. Sumanth**
**Advocate**
6-3-533-535, Villa No.7
Pavani Villas, Dwarakapuri Colony
Punjagutta, Hyderabad-500082
**Call: 9849265550, 9985888594**

## బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

### - కార్పొరేటర్ సాయి జెన్ శేఖర్


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ జీహెచ్ఎంసీ ఇఇ నాగేందర్

**నాచారం జనవరి 18 ప్రభాతవార్త:** నాచారం అంబేద్కర్ విగ్రహం సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద నాచారం పెద్ద నాలా పై ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో రూ. 94 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి నాలా డైవర్షన్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. జరుగుతున్న పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ కాప్రా ఇ.ఇ నాగేందర్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భవాని నగర్ రోడ్డు చాలా బిజీ రోడ్డు నాచారంలోని చాలా కాలనీలకు అలాగే మల్లాపూర్ లోని కొన్ని కాలనీలకు వెళ్లేవారు ఉపయోగించే రోడ్డు కావున బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, భూపాల్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, దాసరి కర్ణ, మక్బూల్ ,హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు


దేవాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కర్మన్ ఘాట్ హనూన్ దేవాలయాన్ని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు దేవాలయ అర్చకులు పూర్ణకుభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, మాజీ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజ ఐఖ్యత : కార్పొరేటర్


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక, సామూహిక భజన కార్యక్రమాలు సమాజంలో ఐఖ్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. భజానంద సమూహ హైద్రాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌బిహెచ్ సి కాలనీలోని విఘ్నేశ్వర కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ మహిళలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, భజానంద సమూహ కార్యక్రమాలకు తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జయశ్రీ లోహార్కర్, రోహిణి జోషి, నేతాపులివార్, లక్ష్మిబాయి జోషి, చేతాలితో పాటు స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మధుయాష్కీ గౌడ్.

**వనస్థలిపురం. జనవరి.18.ప్రభాతవార్త :** సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ గారు పేర్కొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మధుయాష్కీ ని సంప్రదించగా.. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి శనివారం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనని వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎంతోమంది సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, కొండోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు నిబంధనలను పాటించాలి

### -ఆర్టిఓ లెక్కల కిష్టయ్య



**మలక్ పేట ,జనవరి 18, ప్రభాతవార్త :** ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు నియమ, నిబంధనలను పాటించాలని మలక్ పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ఆర్టీవో లెక్కల కిష్టయ్య ఆధ్వర్యంలో ముసారాంబాగ్ లో ని మలక్ పేట ఆర్టిఏ కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చాలని సూచించారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాలని వాహనదారులకు పలు అవగాహన కార్యక్రమాలను, ర్యాలీలను నిర్వహిస్తున్నామని వివరించారు. గత 33 సంవత్సరాల నుంచి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్న మీ దాని, కాచిగూడ, దిల్ షుక్ నగర్ డిపోలకు చెందిన పలువురు ఆర్టీసీ డ్రైవర్లను ఈ సందర్భంగా ఆయన శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ లు రమేష్ బాబు, రాధిక, నరేంద్ర పాల్, బలరాం, ఏఎంవిఐ లు మధుసూదన్ రెడ్డి, జాన్, అష్ఫక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయో హోటలను వెంటనే తొలగించాలి : కడారి అన్నపూర్ణ యాదవ్



**తుర్కయంజాల్ జనవరి 18,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఓయో హోటల్ లో జరిగిన మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాన్ని మరియు మంగళపల్లి ఇంజనీరింగ్ కాలేజ్ లో చదువుతూ హాస్టల్ లో నివాసం ఉంటున్న విద్యార్థినిపై జరిగిన అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ... నిందితులను కఠినంగా శిక్షించాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తగు చట్టపరమైన చర్యల్ని తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నపూర్ణ యాదవ్ వారు శనివారం మాట్లాడుతూ ఈ సందర్భంగా ఓయో హోటల్ ముందు నిరసన తెలియజేస్తూ, అత్యాచార నిందితునతో పాటు, హోటల్ యజమానిని పైన అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకొని, ఓయో లాడ్జి ని శాశ్వతంగా మూసివేయాలని తురకయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని హోటల్స్ పైన సమగ్ర విచారణ జరపాలని, అనుమతులు లేని లాడ్జిలను మూసివేయాలని, అక్రమ హోటల్ వ్యాపారస్తులపై తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కలవడం జరిగింది ఏసీబీ రాజు సానుకూలంగా స్పందించాడు వారు మాట్లాడుతూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిదుతూనే వదిలిపెట్టే ప్రసక్తే లేదు అతనిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో ఉమెన్స్ రైట్ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు పిట్టా గడప రాణి, సరస్వతి, లక్ష్మీ యాదవ్, నాగరాణి, ఉష,మహిళలు తదితరులు పాల్గొన్నారు

## డివిజన్ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ వినతి


జెడిసి, డిసిలకు సమస్యలు వెల్లడిస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జనవరి 18 ప్రభాతవార్త:** డివిజన్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్ నాగేశ్వర్ నగర్‌కాలనీ, గాయత్రిపురం, శ్రీరామలింగేశ్వరకాలనీలో శనివారం ఎల్బీనగర్ జోనల్‌కమిషనర్ హేమంత్‌కేశవ్ పాటిల్, సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాతలతో కలిసి కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించి వారికి సమస్యలను వివరించారు. గాయత్రిపురం నుంచి శ్రీరామలింగేశ్వరకాలనీ మీదుగా వెళుతున్న బాక్స్ డ్రైనేజీలైన్ సగంలో ఆగిపోయిందని వెంటనే బాక్స్ డ్రైనేజ్ పనులు పూర్తిచేసేలా చూడాలని కమిషనర్‌లకు వివరించారు. బాక్స్ డ్రైనేజీలైన్ పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. గతంలో తెలంగాణ పార్క్ అభివృద్ధికి హెచ్‌ఎండిఏ తీసుకోవడం జరిగిందని, పార్క్ అభివృద్ధి మధ్యలోనే ఆపివేయడం జరిగిందని కమిషనర్‌కు వివరించారు. జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో తెలంగాణ పార్క్ అభివృద్ధి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఎస్బిహెచ్ కాలనీ, ఆర్బిఐ కాలనీ, భరత్‌నగర్, బాలాజీనగర్ కాలనీలలో రోడ్లు దెబ్బతిన్నాయని ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నారని వెంటనే నూతన రోడ్లను మంజూరు చేసేలా చూడాలని కమిషనర్‌లకు విజ్ఞప్తి చేశారు. డివిజన్ పరిధిలో జిహెచ్‌ఎంసికి కాలనీ ప్రజలు ఎక్కువ మొత్తంలో టాక్స్ చెల్లిస్తున్నారని, కాలనీలు అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి నిదులు మంజూరు చేయాలని డివిజన్లో సమస్యలు లేకుండా చూసే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డిఈ నవీన్‌కుమార్, శానిటైజేషన్ డిఈ చందన, బుచ్చయ్య, సత్యనారాయణ, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, సుధాకర్, నాగేశ్వర్‌నగర్ కాలనీ సెక్రటరీ విజయ, రాకేష్‌యాదవ్, యాదయ్య, కుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్‌కుమార్, నాగేశ్వర్, ప్రేమ్, విజయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.40లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


రామంతాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, జనవరి 18 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో రూ.40లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రామంతాపూర్ ప్రగతినగర్‌లో రూ.15లక్షల వ్యయంతో పార్కు అభివృద్ధి పనులతోపాటు, శాంతినగర్‌లో 25 లక్షల వ్యయంతో వరద నీటి కాలువ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రామంతాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరుపయోగంగా ఉన్న పార్కు స్థలాన్ని అభివృద్ధి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. పార్కులో చెత్తా చెదారం వేయకుండా చూడాలని ఆయన కోరారు. డివిజన్‌లో చాలా వరకు పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్,పసుల ప్రభాకర్‌రెడ్డి, సంకూరి కుమారస్వామి, నారాయణదాసు, నగేష్, ప్రగతి నగర్ కాలనీ అధ్యక్షుడు డా.కృష్ణమూర్తి, సలహాదారుడు బి.వెంకట్‌రెడ్డి, కోశాధికారి మురళీధర్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, సభ్యులు వెంకటేశ్వర్‌రావు, రాజగోపాల్, శ్రీకాంత్, ప్రభాకర్‌యాదవ్, పరమేశ్వర్, వెంకట్‌రెడ్డి, సత్యం, సాగర్, గంగాధర్, రమేష్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, చిన్నబాబు, ఇంద్రసేనారెడ్డి,రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.55లక్షలతో అభివృద్ధి పనులు : బన్నాల గీత


చిలుకానగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో రూ.55లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిలుకానగర్‌లోని వివిధ వర్గాలకు చెందిన స్మశానవాటికలో చేపట్టే పనులను ఆమె ప్రారంభిచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ముస్లిం, మైనార్టీలతోపాటు, కురుమ, రెడ్డి స్మశానవాటికలో పలు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. మైనార్టీ స్మశానవాటికలో బండరాళ్ల తొలగించడంతోపాటు, కురుమ కులస్థుల స్మశానవాటికలో మాడ్రన్ టాయిలెట్లు, రెడ్డి స్మశానవాటికలో ప్రహరిగోడ, వాచ్‌మెన్ రూమ్, స్టోర్ రూమ్ వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ వినీల్‌గౌడ్, ఎఇ వినీత్‌రావు, బిఆర్‌ఎస్ నేతలు ఏదుల కొండల్‌రెడ్డి, కె.జగన్, ఎం.శ్రీనివాస్, అశోక్‌చారి, సుందర్, శ్యామ్, అప్సర్, రాజ్యలక్ష్మి, అండాలు, అబ్బుబాయ్, చిందం వెంకటేష్, బండి చంద్రారెడ్డి పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో ఘనంగా సామల జనార్ధన్‌రెడ్డి పదవ వర్ధంతి


సామల జనార్ధన్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపిపి సామల రంగారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 18 ప్రభాతవార్త:** పూర్వ సరూర్‌నగర్ మండలంలోని బాలాపూర్ గ్రామ మాజీ పటేల్/విఆర్‌ఒ, కేంద్ర రక్షణ పరిశోధన సంస్థలకు చెందిన మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ (ఎంఇఎస్) బిల్డర్స్ అసోసియేషన్ మాజీ చైర్మన్ సామల జనార్ధన్‌రెడ్డి పదవ వర్ధంతి శనివారం ఘనంగా జరిగింది. బాలాపూర్ గ్రామ సమీపంలోని ఆర్‌సిఐ రోడ్డులోనున్న సామల ఎస్టేట్స్‌లో జనార్ధన్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు, బాలాపూర్ గ్రామ మాజీ పోలీస్ పటేల్ సామల రంగారెడ్డి జనార్ధన్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా సామల జయలక్ష్మీ, జనార్ధన్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, శ్రావణి, పావని, అశ్వినిలతో పాటు సామల వినోద రంగారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌రెడ్డి, పలువురు సామల కుటుంబీకులు తదితరులు జనార్ధన్‌రెడ్డి విగ్రహానికి పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణారెడ్డి, దయాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు


ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

**ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నాట్య స్కూల్ ఆఫ్ కూచిపూడి కుమారి లహరి బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశా పంచరత్న, మూషికవాహన, బృందావన, సారంగీ తిల్లాన, నీలమేఘ, శరీర, ఒకపరికొకపరి,భో శంభో, రుక్మిణి ప్రవేశ దరవు, నారాయణతే నమోనమో, మణినూపుర దరి, అమృతమోహిని, కులుకాగా నడవరో, సిజ్ఞాయనాయమ్మా, మహంకాళి కీర్తన, మంగళం అంశాలను కళాకారులు లహరి, ప్రియా,ఇషిక, పూర్వీక, శ్రావణి, మహాలక్ష్మి, రోహిత, సంచిదా,వర్షిణి తదితరులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

## త్రిబుల్ ఆర్ వస్తువుల సేకరణ




**మల్కాజ్గిరి జనవరి18,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో ఈస్ట్ ఆనంద్ బాగ్ ,మల్కాజ్గిరి కాలనీలో శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక వాహనంతో త్రిబుల్ ఆర్ వస్తువుల సేకరణ చేశారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ వస్తువులు పాత పుస్తకాలు, బట్టలు, పాత సైకిళ్ళు, ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించారు. కాలనీ అసోసియేషన్ వారి సహకారంతో ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి శానిటేషన్ విభాగం సానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు సానిటరీ సూపెర్వైసోరీ ,గిరి, శ్రీమతి వసంత శీనీతి శానిటేషన్ సిబ్బంది వీధి వీధి తిరిగి ప్రచారాన్ని చేస్తూ కాలనీలలో ఇండ్ల యజమానులు ఇచ్చిన వివిధ రకాల త్రిబుల్ ఆర్ కు సంబంధించిన మెటీరియల్ అనగా పాత పుస్తకాలు ప్లాస్టిక్ బాటిల్స్ పాత సైకిళ్ల కూలర్ స్వెటర్స్, రకరకాల వస్తువులను సేకరించి ఈస్ట్ ఆనంద్ బాగ్ మరియు మల్కాజ్గిరి లో ఏర్పాటు చేసిన త్రిబుల్ ఆర్ సెంటర్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ మరియూ మల్కాజ్గిరి అసోసియేషన్ సభ్యులు మరియూ కాలనీల వాసులు పాల్గొన్నారు.

## ఎన్టిఆర్‌కు నాయకులు నివాళి


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేలపాటి రామారావు తదితరులు

**వనస్థలిపురం. జనవరి.18.ప్రభాతవార్త.** దేశంలోనే తెలుగు రాష్ట్రానికి ఒక గుర్తింపు తీసుకోని వచ్చిన నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్బంగా శనివారం వనస్థలిపురం, విగిళి చౌరస్తా వద్ద తారక రామారావు విగ్రహన్ని గజ మాలతో అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, బుద్దా సత్యనారాయణ మరియు కమ్మ సంఘ సభ్యులు కర్నాటి కృష్ణ మూర్తి, నూతి శ్రీనివాస్, ఉప్పలపాటి బాబు , పద్మారెడ్డి , తీరిల్రీ రెడ్డి , గాడిపర్తి గోవర్ధన్, నర్సయ్య , అనిల్ , సురేంద్ర ,సుధాకర్,శ్రీను, విష్ణు, సుధీర్, మాధవరావు , మకుటం సదాశివుడు, స్వర్ణ మాధవి చౌదరి ,అభిమానులు, పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ మెంబెర్‌గా లచ్చిరెడ్డి ప్రమాణం


లయన్స్ క్లబ్ మెంబెర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం జనవరి.18.ప్రభాతవార్త :** వనస్థలి క్రాంతి క్లబ్ సర్వసభ్య సమావేశం మధురా రెసిడెన్సీలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి,లయన్స్ క్లబ్ మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. లయన్ సాధు శ్యాం ప్రసాద్ జిల్లా కోఆర్డినేటర్ ప్రమాణ స్వీకారం చేయించగా లయన్ నందిరాజు లక్ష్మీ నారాయణ క్లబ్ అధ్యక్షులు మెంబర్ కు అంతర్జాతీయ పిన్ అందచేసారు. ఈ సందర్భంగా లయన్ లచ్చి రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ మరియు సమాజ సేవ తనకెంతో ఇష్టమని భవిష్యత్తులో లయన్ క్లబ్ వారు నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలియచేస్తూ మరియు నిరుపేద పిల్లలకు బెడ్లు కొనడం కోసం పదివేల రూపాయల విరాళం క్లబ్ కు అందచేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్పర్సన్ లయన్ వాసుదేవ రావు, క్లబ్ కార్యదర్శి లయన్ సాధు కృష్ణ కిషోర్ ,కోశాధికారి లయన్ మహేష్ కుమార్ మరియు సభ్యులు పాల్గొన్నారు.

## ఓల్డ్ మలక్ పేట డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా సతీష్ సింగ్


సతీష్ సింగ్ ను సన్మానిస్తున్న రాం కోటేశ్వరరావు, చౌకి రవికుమార్, చౌకి రాజు తదితరులు

**మలక్ పేట ,జనవరి 18, ప్రభాతవార్త :** ఓల్డ్ మలక్ పేట డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా సతీష్ సింగ్ నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓల్డ్ మలక్ పేట డివిజన్ లో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తామని పేర్కొన్నారు. ఓల్డ్ మలక్పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా నియమితులైన సతీష్ సింగ్ ను మలక్ పేట ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో మలక్ పేట్ లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పజేసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వేమూరి రామ్ కోటేశ్వరరావు చౌకిరాజు, చీపురు రాజారావు గౌడ్, డివిజన్ బిజెపి మాజీ అధ్యక్షుడు కనక బోయిన రాజు, ఎం. రాజు, ఎల్.ఆర్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### - మాజీ మంత్రి మహమూద్ అలీ


చాదర్‌లను సమర్పిస్తున్న మాజీ హోం మంత్రి మహమూద్ అలీ

**మలక్ పేట జనవరి 18, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ ఆకాంక్షించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహముద్ అలీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్గా హాజరత్ జహంగీర్ పిరాన్ వద్ద చాదర్ లను భక్తిశ్రద్దలతో సమర్పించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్ర ప్రజలు శ్రేయస్సు కోసం ప్రార్థించారు.కార్యక్రమంలో నాయకులు మునీర్, బద్రుద్దీన్, సయ్యద్ లయక్ ఆలీ,యూసుఫ్ పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి


స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు శనివారం ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. టిడిపి పార్లమెంట్ ఇంచార్జీ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చిలుకానగర్ చౌరస్తాలో స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అశోక్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి డివిజన్ నాయకులు డా.అశోక్, తిక్క ప్రకాష్,ప్రతిభ,ఇమామ్,గోపాల్‌రెడ్డి,గాంధీ పాల్గొన్నారు.

## లక్ష్మినగర్‌లో ఆర్.ఆర్.ఆర్ సెంటర్ ప్రారంభం


ఆర్.ఆర్.ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఆర్.ఆర్.ఆర్ సెంటర్‌ను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మనకు పనికిరానివి అనుకున్న వస్తువులు మరొకరికి ఎంతో అవసరమైనవిగా ఉండవచ్చని, దాని కోసమే ఆర్.ఆర్.ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాలనీవాసులు తమకు పనికి రావు అనుకున్న వాటిని ఈ సెంటర్‌లో ఇస్తే వాటిని అవసరమైన వారికి అందజేయడం జరుగుందన్నారు. ఆర్.ఆర్.ఆర్ సెంటర్ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డిసి శంకర్‌సింగ్, డిఇ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్సా స్వచ్ఛంద సంస్థ సేవలు ఎంతో గొప్పవి : డిప్యూటీ మేయర్


చిన్నారులతో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, జనవరి 18 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్ వినోబా నగర్ లో ఆప్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇంద్ర ధనస్సు బాలల సంఘం చైల్డ్ ఫ్రెండ్లీ వార్డ్ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, వినోబా నగర్ బస్తి, తార్నాక డివిజన్ పరిధిలోని పిల్లలు తమ ప్రాంతంలోని పలు సమస్యలను డిప్యూటీ మేయర్ కు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పిల్లలను రాజకీయ, సామాజిక బాధ్యతల పట్ల అవగాహణ కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. పిల్లల ఫిర్యాదులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఇందులో భాగంగా, పిల్లల హక్కులు, పౌర సమానత్వం, ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై చర్చించారు. పిల్లల అభిప్రాయాలను బలంగా ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు మైలురాయిగా నిలుస్తాయని డిప్యూటీ మేయర్ గారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులతో పాటు వినోభానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు స్వామి, కిరణ్, పరమేష్, అశోక్, అప్సా సంస్థ ప్రతినిధులు బస్వరాజ్, మంజుల, ఇందిర, మల్లిక తధితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో చిన్నారుల అర్ట్స్ ఎగ్జిబిషన్ : రజితరెడ్డి


హబ్సిగూడలో చిన్నారుల ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త :** హబ్సిగూడలో చిన్నారుల కోసం గ్లోబల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శనివారం ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిన్నారుల కోసం ప్రత్యేకంగా పేపర్ పై వేసిన పెయిటింగ్స్ ఎంతో ఆకట్టుకుంటున్నాయని, కేవలం చదువు, మార్కుల మీద ఒత్తిడి తెచ్చే విధంగా తమ కళను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. చిన్నారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు గీసిన పెయింటింగ్స్‌ను ఆమె తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వహకులు, పాల్గొన్నారు.

## హోటల్ వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలి




**తుర్కయంజాల్ జనవరి 18 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఓయో హోటల్ లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాన్ని మరియు మంగళపల్లి ఇంజనీరింగ్ కాలేజ్ లో చదువుతూ హాస్టల్ లో నివాసం ఉంటున్న విద్యార్థినిపై జరిగిన అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ... నిందితులను కఠినంగా శిక్షించాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తగు చట్టపరమైన చర్యల్ని తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్య, జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలు విజయా , ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వయో హోటల్ ముందు నిరసన తెలియజేస్తూ, అత్యాచార నిందితునతో పాటు, హోటల్ యజమానిని పైన అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకొని, ఓయో లాడ్జి ని శాశ్వతంగా మూసివేయాలని తురకయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని హోటల్స్ పైన సమగ్ర విచారణ జరపాలని, అనుమతులు లేని లాడ్జిలను మూసివేయాలని, అక్రమ హోటల్ వ్యాపారస్తులపై తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుందరమ్మా, నీలా, పద్మ, ప్రసాద్, భాస్కర్, పల్లపు శివ తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త :** ఉప్పల్ సాయికృష్ణఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ బి.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాయికృష్ణకాలనీ, అంజతా హోటల్, శ్రీ కృష్ణ పార్మా, ఎస్ఎస్ బయోటెక్, రాజధాని ప్రింటర్స్, ఉప్పల్ పారిశ్రామికవాడ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్న రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.